క్లుప్తంగా

అధికారులందరూ హాజరుకావాలి

• కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అధికారులు హాజరుకావాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ హెచ్చరించారు.

ప్రజావేదికకు అధికారులు గైర్హాజరు

కూడేరు: మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మాకొట్టారు. ఇక్కడ ట్రైనీ కలెక్టరు వినూత్న నాలుగు వారాల పాటు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె శిక్షణ పూర్తి అయ్యిందని తెలుసుకున్న అధికారులు సోమవారం ప్రజావేదికకు గైర్హాజరయ్యారు. అర్జీలు స్వీకరించేవారు లేక మళ్లీ అధికారుల తీరు మొదటికి వచ్చిందటూ ప్రజలు వెనుదిరిగారు.

అరటి పంట పరిశీలన

కణేకల్లు: కణేకల్లుక్రాస్‌లో సాగు చేసిన అరటి పంటను హార్టికల్చర్ అధికారి మౌనిక సోమవారం పరిశీలించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో రైతు వైపీ నాగిరెడ్డి ప్రతి మొక్కకూ ఈత పట్టలు (ఈతాకు కొమ్మలు) కప్పిన విధానం చాలా బాగుందని హెచ్ఓ మెచ్చుకున్నారు. ఈత పట్టలు, కప్పే కూలీ ఖర్చులు కలిపి ఎకరానికి రూ.12 వేల వరకు ఖర్చు వస్తున్నట్లు రైతు నాగిరెడ్డి తదితరులు తెలిపారు. మామిడి మొక్కల రక్షణకు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం కవర్లను పంపిణీ చేస్తోందన్నారు.

విజ్ఞాన విహార యాత్రకు ఇద్దరు ఎంపిక



విజ్ఞాన విహారయాత్రకు ఎంపికైన విద్యార్థినులు

బొమ్మనహాళ్: ఈనెల 20, 21న బెంగళూరు విజ్ఞాన విహార యాత్రకు కేజీబీవీ ఎనిమిదో తరగతి ఆర్. పూజిత, కె. జయలక్ష్మి ఎంపికయిన్నట్లు ప్రిన్సిపాల్ కమలమ్మ సోమవారం తెలిపారు. జనవరి 2న మండల స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఇద్దరూ ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయి ప్రాజెక్ట్ నమూనా స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఎంపికయినట్లు తెలిపారు. విద్యార్థినులతో కలిసి సైన్సు టీచర్ గౌరీదేవి పాల్గొంటారని తెలిపారు.

మహిళా సమైక్య కార్యదర్శి పదవికి రాజీనామా

రాయదుర్గంటౌన్: భారత జాతీయ మహిళా సమైక్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాయదుర్గం శాఖ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు పార్వతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. రాజీనామాను మహిళా సమైక్య జిల్లా కార్యదర్శికి లేఖ పంపుతున్నట్లు తెలిపారు.

కూలర్ల వితరణ



పెన్నహోబిలం ఆలయానికి కూలర్లు అందిస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్, సిబ్బంది

ఉరవకొండ: ఉరవకొండ కెనరా బ్యాంకు బ్రాంచ్ ఆధ్వర్యంలో బ్యాంకు సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల కింద పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి రూ.2 లక్షలు విలువ జేసే రెండు టెంటో ఫైటర్‌లు, ఫ్లడ్‌లైట్లు, వైరింగ్ సామగ్రి సోమవారం అందించారు. బ్యాంకు మేనేజర్ కిశోర్, సిబ్బంది రంగనాథ్, విజయ్ ఆధ్వర్యంలో ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబుకు అందించారు. ఆలయ ఈఓ ఆధ్వర్యంలో మేనేజర్, సిబ్బందిని సన్మానించారు.

పునీత్‌రాజ్‌కుమార్ జయంతి



పునీత్ రాజ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఈడిగ సంఘం సభ్యులు

రాయదుర్గంటౌన్: దివంగత కన్నడ సినీ హీరో పునీత్ రాజ్ కుమార్ జయంతి వేడుకలు ఈడిగ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. తొలుత పునీత్ రాజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఏరియా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. దాదాపు 300 మందికి అన్నదానం చేయించారు. ఈడిగ సంఘం అధ్యక్షుడు అశోక్, మర్రిస్వామి, గంగాధర, మారుతి, సిద్దప్ప, నీలకంఠ, రమేష్ పాల్గొన్నారు.

దివ్య సుగంధాల మాసం.. రంజాన్

వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత
- నిష్టనియమాలతో కూడిన జీవన విధానం
- ఉపవాస దీక్షాపరులు, నమాజ్‌లతో మసీదులు కళకళ



నమాజ్‌లో నిమగ్నమైన ముస్లింలు



మసీదులో ఉపవాస దీక్ష విరమిస్తున్న ముస్లింలు

రాయదుర్గం టౌన్: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ మాసం కావడంతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. ముస్లింలు జరుపుకునే ప్రధాన పండుగల్లో ఈద్ ఉల్ ఫిత్ర్ (రంజాన్) ఒకటి. ఈ మాసానికి ఇస్లాంలో ప్రత్యేకత ఉంది. ఈ మాసంలోనే దివ్య ఖురాన్ దివి నుంచి భువికి అవతరించింది. నెలరోజుల పాటు ముస్లింలు తెల్లవారుజాము నుంచి సూర్యాస్తమయం వరకు నిష్టతో కఠోర ఉపవాస దీక్ష చేసి, దైవారాధనతో గడుపుతారు. కేవలం ఆహార పానీయాలు మానివేయడమే కాదు.. నిష్టతో కూడుకున్న జీవన విధానాన్ని పాటిస్తారు.

ఇస్లాం నాల్గో మూలస్తంభం ఉపవాసం..

ఉపవాసం..ఎదుటివారి ఆకలి విలువ గుర్తించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. చిన్నారుల నుంచి ముదుసలి వయస్సు వారి వరకు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించి, భక్తిభావంతో ప్రత్యేక నమాజు చేస్తారు. రోజూ ఐదు పూటలా నమాజుతో పాటు ప్రత్యేకంగా తరావీ ప్రార్థనలు కూడా చేస్తున్నారు. దివ్య ఖురాన్ పఠిస్తున్నారు. జిల్లాలో ముస్లింలు గణనీయ సంఖ్యలో ఉన్న ప్రాంతాల్లో ఎటు చూసినా రంజాన్ సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా సహరీ, ఇఫ్తార్ సమయంలో మసీదుల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంటుంది. ఇఫ్తార్ విందులతో కిటకిటలాడుతున్నాయి.

వెల్లివిరుస్తున్న భక్తిభావం..

దివ్య ఖురాన్, హదీస్ ఇస్లాంకు పవిత్ర మత గ్రంథాలు. రంజాన్ మాసంలోనే దివ్య ఖురాన్ భూమిపై అవతరించింది. భక్తిగా ఉండడం, దైవ ప్రార్థనలు చేయడం, మద్యపానం, అబద్ధాలు ఆడడం, చాడీలు చెప్పడం, ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలని ఈ గ్రంథాలు బోధిస్తాయి. ఉపవాసం ఆచరించే వారంతా తెల్లవారు జామున తీసుకునే సహరి నుంచే దైవ చింతనలో గడుపుతారు. పగలంతా కూడా ఉపవాస దీక్షను ఆచరించడం, సూర్యాస్తమయం తర్వాత ఇఫ్తార్ చేశాక రాత్రి ప్రత్యేక తరావీ ప్రార్థనల్లో పాల్గొంటారు. సహరి, ఇఫ్తార్ చేసేందుకు సౌకర్యం లేని వారికి, పేదల కోసం కొన్ని మసీదుల్లో ఉదయం, సాయంత్రం ఏర్పాట్లను చేస్తారు. తరావీ ప్రార్థనలు చేయడం వల్ల పుణ్యఫలాలు దక్కుతాయని దివ్య ఖురాన్ చెబుతోంది. దీని కోసం ప్రత్యేకంగా ఖురాన్ బోధనలు చేసేందుకు మత గురువుల (హఫీజ్)లను మసీదులలో నియమించుకుంటారు.

ఉపవాసాలు మూడు విధాలు..

రంజాన్ మాసాన్ని మూడు భాగాలుగా వర్గీకరిస్తారు. ప్రస్తుతం ఒకటో భాగంగా పూర్తయి రెండో భాగంలో రంజాన్ దీక్షలు కొనసాగుతున్నాయి. మొదటి పది రోజులు దైవ కారుణ్యానికి ప్రతీక. తర్వాత పదిరోజులు క్షమాభిక్షకు ప్రతీక. చివరి పదిరోజులు నరకం నుంచి విముక్తికి ఉపకరిస్తాయని దైవ ప్రవక్త మహమ్మద్ (సాఅసా) అభివర్ణించారు.

ధాన ధర్మాలు:

జకాత్ రూపంలో ధాన, ధర్మాలు చేసి పేదలను ఆదుకోవడం, పేదవాని ఆకలి తీర్చడం కోసం ముస్లిం ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతి ముస్లిం తన స్థిర, చరాస్తుల నుంచి 2.5 శాతాన్ని పేదలకు తప్పనిసరిగా ఇవ్వాలని ఖురాన్ చెప్తోంది. దీన్ని జకాత్ అంటారు. జకాత్‌తోపాటు ఫిత్రా దానానికి రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. మూడు పూటలా తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు ఎంతో మంది ఉంటారు. ఇలాంటి అభాగ్యులు, పేదవారికి పండుగ సందర్భంలో దానం చేయాలని ఇస్లాం మతం ప్రబోధిస్తుంది. దీన్నే ఫిత్రాదానం అంటారు. దీక్షను విరమించే సమయంలో చేపట్టే ఇఫ్తార్‌లు సోదరభావం, సౌభ్రాతృత్వానికి పెద్ద పీట వేస్తాయి. సాయం సంధ్య వేళ మసీదుల వద్ద చేపట్టే ఇఫ్తార్‌తో సోదరభావం పెంపొందుతోంది. మొత్తం మీద మసీదులు, ఇళ్లలో రంజాన్ మాసమంతా ఆధ్యాత్మికతతో కూడిన వాతావరణం ఉంటుంది.

ఐక్యత, సేవా భావానికి ప్రతీక 'ఇఫ్తార్'

ఆధ్యాత్మికతకే కాకుండా ఐక్యత, సేవాభావానికి ఇఫ్తార్ విందులు ప్రతీకగా నిలుస్తాయి. అల్లా ప్రవక్త (సఅసం) ప్రవచనాల ప్రకారం రంజాన్ మాసంలో ఎవరైనా ఒక ఉపవాసికి అల్లాహ్ సమ్మతం లేదా పుణ్యం పొందడానికి ఇఫ్తార్ చేయిస్తే అతను తన పాపాల నుంచి క్షమించబడి, ఏకంగా నరకాగ్ని నుంచి మోక్షం పొందుతాడని పేర్కొన్నారు. అంతేకాక ఉపవాసికి ఎంతైతే పుణ్యం దక్కుతుందో, అంతే పుణ్యం ఇఫ్తార్ చేయించి వారికి దక్కుతుందన్నారు. ప్రవక్త ఇంకా పేర్కొంటూ ఎవరైనా కేవలం ఒక ఖర్జూరపు ముక్కైనా లేదా కేవలం ఓ గుటక నీరు లేదా పాలు అందించి ఇఫ్తార్ చేయించినా అంతే ప్రతిఫలం దక్కుతుందన్నారు. అందుకే రంజాన్‌లో ఇఫ్తార్‌కు ప్రాధాన్యత ఉంటుంది. శక్తికొద్దీ సేవలు అందించేందుకు యువత, దాతలు ముందుకొస్తారు. మసీదుల్లో సామూహికంగా ఇఫ్తార్, సహేరీల కోసం ఏర్పాట్లు ఉవాసి సేవలో తరిస్తారు.

ఉపవాస దీక్షలతో అల్లా కృప



రంజాన్ మాసంలో చేసే కఠోర ఉపవాస దీక్షల వల్ల అల్లా కరుణ లభిస్తుంది. పేదలకు ధానధర్మాలు చేయడం వల్ల వారి కుటుంబాలు కూడా అభివృద్ధి చెందుతాయి. అల్లా, ప్రవక్త చూపిన మార్గంలో నడవడం వల్ల సమ సమాజ స్థాపన, మత సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరుస్తాయి. రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనది. ఈ నెలంతా ఇబాదత్ (దైవప్రార్థన)తో గడపాలి.

– ప్రభుత్వ ఖాజీ మొహమ్మద్ సైపుల్లా, రాయదుర్గం

వైభవంగా ఎర్రిస్వామి తాత రథోత్సవం



వై.రాంపురంలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని వై.రాంపురంలో వెలసిన ఎర్రితాత స్వామి ఆలయ రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. కళ్యాణదుర్గం, బెళుగుప్ప, ఉరవకొండ మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం స్వామి రథోత్సవాన్ని గ్రామంలో ఊరేగించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇవ్వాలి

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం చూపాలని దళిత గిరిజన రాష్ట్ర అధ్యక్షుడు బి. సాకే రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ సేన, దళిత గిరిజన హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేన నాయకులు ఉలికేరి నాగార్జున, కె.సి. పవన్, ఉమేష్, హొన్నూరు వన్నూరుస్వామి, సురేష్, ఉద్దేహాళ్ రామాంజనేయులు, శ్రీధరఘట్ట ఆనంద్, గోపాల్ పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి



డీఈ రవిప్రకాష్‌నాయుడుతో చర్చిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధికారులు, నీటి సరఫరా విభాగం సిబ్బందికి సూచించారు. సోమవారం తన చాంబర్‌లో మున్సిపల్ డీఈ రవిప్రకాష్‌నాయుడుతో చర్చించారు. నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా ఉండేందుకు స్టాండ్‌బై మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉండేలా చర్యల చేపట్టాలన్నారు.

సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఆర్టీటీ ఆర్‌డీ కృష్ణవేణి

కూడేరు: ఆర్టీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు సోమవారం అందించారు. ఇప్పేరు ప్రాథమికోన్నత పాఠశాలకు పి.నాగిరెడ్డి పల్లి, అంతరగంగ గ్రామాల నుంచి విద్యార్థినీవిద్యార్థులు నడిచి వచ్చారు. దీంతో ఆర్టీటీ తరఫున విద్యార్థులకురీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి సైకిళ్లు అందించారు. కార్యక్రమంలో ఏటీఎల్ నల్లపరెడ్డి, ఎంఈఓ–2 సాయికృష్ణ, హెచ్ఎం వసంత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'పది'ంతల కష్టాలు



బొమ్మనహాళ్: లగేజీ ఆటోలో ప్రయాణిస్తున్న పదో తరగతి విద్యార్థులు



కణేకల్లులోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు 'పది'ంతలు కష్టాలు పడాల్సి వచ్చింది. సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. బొమ్మనహాళ్ మండలంలో నాలుగు సెంటర్లను ఏర్పాటు చేసింది. అందులో మండల కేంద్రంలో మూడు సెంటర్లు, ఉద్దేహాళ్ హైస్కూల్‌లో ఒక సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రాలకు 18 పాఠశాలల నుంచి 888 విద్యార్థులు చేరుకోవాల్సి ఉంది. బళ్లారి నుంచి కళ్యాణదుర్గం వెళ్లే రహదారి నుంచి వెళ్లే బస్సుల్లో ఆయా గ్రామాల విద్యార్థులు వెళ్తారు. బస్సులు వెళ్లని గ్రామాల విద్యార్థులు రవాణా సౌకర్యం లేక అవస్థలు పడాల్సి వచ్చింది. నేమకల్లు, ఉంతకల్లు, చంద్రగిరి గ్రామాలకు బస్సు సౌకర్యమే లేదు. దేవగిరి, గోవిందవాడ, దర్గాహొన్నూరు, కల్లుహోళ, శ్రీధరఘట్ట, సింగానహళ్లి గ్రామాలకు బస్సు సౌకర్యం ఉన్నా.. అది పరీక్షల సమయానికి విద్యార్థులకు అందుబాటులో లేదు. చంద్రగిరి పాఠశాలలో చదివే 10వ తరగతి విద్యార్థులకు జిందాల్ సాప్ ఫ్యాక్టరీ యజమాన్యం బస్సు ఏర్పాటు చేసింది. మిగిలిన గ్రామాల 10వ తరగతి విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ లగేజీ ఆటోల్లో సాహసం చేస్తూ ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పనులు మానుకొని పిల్లలను పరీక్ష కేంద్రాలకు వదలివెళ్లాల్సి వస్తోంది.

కూడేరు: మొదటిరోజు పదోతరగతి తెలుగు పరీక్షకు ఇద్దరు గైర్హాజరయ్యారు. కూడేరులోని హైస్కూల్, కేజీబీవీలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. హైస్కూల్ కేంద్రంలో 200 మందికి ఇద్దరు గైర్హాజరయ్యారని ఎంఈఓ మహమ్మద్ గౌస్ తెలిపారు. కేజీబీవీలో 85 మంది హాజరయ్యారు. ఎంఈఓ–1,2లు మహమ్మద్ గౌస్, సాయికృష్ణ కేంద్రాలను పర్యవేక్షించారు.

శెట్టూరు: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాల కేంద్రాల్లో 380 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ వాణిదేవి సోమవారం తెలిపారు.

రాయదుర్గంటౌన్: మండలంలో మొత్తం ఏడు కేంద్రాల్లో మొదటిరోజు పదో తరగతి తెలుగు పరీక్ష 1,468 మంది రాయాల్సి ఉండగా, 14 మంది గైర్హాజరయినట్లు ఎంఈఓ నాగమణి సోమవారం తెలిపారు. పరీక్షా కేంద్రాలను డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, ఎంఈఓ నాగమణి పరిశీలించారు. కేంద్రాలను సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కణేకల్లు: కణేకల్లులోని జెడ్పీబాలుర, మోడల్ స్కూల్, విద్యానికేతన్, అతావుల్లా స్కూల్ కేంద్రాల్లో మొదటిరోజు తెలుగు పరీక్షకు 964 మంది హాజరుకావాల్సి ఉండగా, 951 మంది హాజరైనట్లు మండల విద్యాధికారులు తెలిపారు. 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, ఎస్ఐ నాగ మధు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రతిభ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ఉద్దేహాళ్ ఉన్నత పాఠశాలలో సోమవారం పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు 847 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 860 మంది పరీక్ష రాశారు. 14 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ మల్లికార్జున తెలిపారు.

బ్రహ్మసముద్రం : మండలంలో మొత్తం 377 మంది విద్యార్థులు మొదటి రోజు సోమవారం తెలుగు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 374 మంది హాజరయ్యారు. మరో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయినట్లు ఎంఈఓ ఓబుళపతి తెలిపారు.



కళ్యాణదుర్గం: కేసీజీహెచ్ఎస్ ఆవరణలో డ్రోన్‌తో పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న సీఐ యువరాజ్

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రెండు కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పదోతరగతి పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు. ఉన్నత పాఠశాల, శ్రీనివాస విద్యానికేతన్ కేంద్రాల్లో మొత్తం 422 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. డీఎస్పీ అష్రఫ్ అలీ, ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

డ్రోన్‌తో ప్రత్యేక నిఘా

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో సోమవారం నుంచి జరుగుతున్న పదోతరగతి పరీక్షలకు అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. కళ్యాణదుర్గంలో ఐదు సెంటర్లలో జరిగే పరీక్షలకు 1,248 మంది హాజరుకావాల్సి ఉండగా, మొదటి రోజు తెలుగు పరీక్షకు 1,234 మంది విద్యార్థులు హాజరయ్యారు. 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాస్ కాపీయింగ్ పాల్పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. డ్రోన్ సాయంతో కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షా కేంద్రాల చుట్టూ నిఘా ఉంచారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ యువరాజ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రంలో ఉక్కపోత..

ఉరవకొండ: పట్టణంలో ఏర్పాటు చేసిన పది పరీక్షా కేంద్రాల్లో అసౌకర్యాల నడుమ సోమవారం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పట్టణంలో ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొన్ని గదుల్లో లైట్లు, ఫ్యాన్లు పని చేయక పోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. ఎండతీవ్రతతో ఉక్కపోతతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రభుత్వ జెడ్పీ బాలికల పాఠశాల, జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు ఎండలోనే పెట్టారు. ఐదు పరీక్షా కేంద్రాల పరిధిలో 1,099 మంది విద్యార్థులు పరీక్షాలకు హాజరుకావాల్సి ఉండగా, 1069 మంది పరీక్షలకు హాజరయ్యారు. 30 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు.



ఉరవకొండ జెడ్పీబాలికల పాఠశాలలో ఉక్కపోతలోనే పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాత్రికేయుడిపై దాడి దుర్మార్గం

కళ్యాణదుర్గం రూరల్: రైతు ఆవేదనను న్యూస్‌కవరేజ్ చేసిన పాత్రికేయుడు రాఘవేంద్రపై దాడి చేయడం దుర్మార్గమని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం ఖండించారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్టలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించేందుకు యత్నించిన విద్యుత్ కాంట్రాక్టర్ సాబ్జాన్‌పై రైతు ఫిర్యాదు చేశాడు. మీడియా ప్రతినిధులకు సమాచారం అందించాడని ఆదివారం బళ్లారి మిట్టపై ఉన్న రాఘవేంద్రపై సాబ్జాన్ దాడి చేశాడు. గాయపడిన రాఘవేంద్రను వివిధ సంఘాల నాయకులు సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు తిప్పానాయక్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

బెళుగుప్ప: హౌసింగ్ లబ్ధిదారులు పొజిషన్ సర్టిఫికెట్లకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ షర్మిళ తెలిపారు. సోమవారం వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 983 మందికి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు అయ్యాయన్నారు. సచివాలయాల్లో గాని, మీసేవ కేంద్రాల్లో గానీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు.

శాస్త్రోక్తంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



కొలువుదీరిన పంచముఖి ఆంజనేయుడు



విగ్రహ ప్రతిష్టకు హాజరైన మహిళలు

కణేకల్లు: కణేకల్లు క్రాస్‌లో నూతన ఆలయంలో పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్టించారు. వేకువజామున పంచముఖ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా సాగింది. ఆలయ ఆవరణంలో గణపతి, నాగదేవత, నరసింహస్వామి, శివపార్వతి విగ్రహాలతోపాటు నవగ్రహ విగ్రహాలను ప్రతిష్టించారు.

సపోట పండ్లతో అలంకరణ



సపోట పండ్ల అలంకరణలో జంబుకేశ్వరుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన జంబుకేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు జరిగాయి. సపోట పండ్లతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. స్వామికి పంచామృతాభిషేకం, ఏకబిల రుద్రాభిషేకం, కుంకుమ అర్చన, మంగళ నైవేద్యాలు చేపట్టారు.

చలివేంద్రాల ఏర్పాటు

బొమ్మనహాళ్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసిన్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌రామ్, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెబాట

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు సకాలంలో పరిష్కరించకపోతే సమ్మెబాట పడతామని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం తెల్లవారుజామున మస్టర్ సమయంలో అరగంట పాటు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ సమస్యలపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు తిప్పేస్వామి, కార్యదర్శి మల్లేష్, కోశాధికారి రాము, తదితరులు పాల్గొన్నారు.

రథం తయారీకి విరాళాల వెల్లువ

కూడేరు: స్థానిక జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ రథం తయారీకి దాతల నుంచి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. సోమవారం కూడేరు ఎస్సీ కాలనీవాసులు

సంక్షిప్త సమాచారం

రూ.50,116, గొర్లగిడ్డ సంగప్ప భార్య లీలావతి రూ.5116, బోయ అంకే రమేష్ రూ.25,116 విరాళంగా అందించారు.

నేడు పెద్దమ్మ తల్లి దేవర

బెళుగుప్ప: కాలువపల్లిలో వెలసిన పెద్దమ్మ దేవర మంగళవారం నిర్వహించనున్నారు. ఇటీవల ఆలయాన్ని నిర్మించారు.

కూలీలకు ఎస్ఐ కౌన్సెలింగ్

బొమ్మనహాళ్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి కర్ణాటక ప్రాంతాలకు మిరప కోతకు వెళ్తున్న కూలీలకు ఎస్ఐ నబీరసూల్ సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. బొలెరో వాహనాలను ఆపి డ్రైవర్లను మందలించారు. కూలీలను తరలిస్తున్న 6 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విధులకు హాజరైన తహసీల్దార్

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం తహసీల్దార్ భాస్కర్ సోమవారం విధుల్లో చేరారు. అనారోగ్యంతో కొన్ని రోజులుగా మెడికల్ సెలవులో వెళ్లారు. మండల రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. అనంతరం కార్యాలయానికి పలు సమస్యలపై వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

మహిళకు తీవ్ర గాయాలు

కూడేరు: మండలంలోని అరవకూరు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లిఖిత అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన లిఖిత భర్త రామాంజనేయులుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. కుక్క అడ్డు వచ్చి అదుపుతప్పి కిందపడ్డారు.

ఈకేవైసీ చేయించుకున్నవారికే రేషన్

కూడేరు: రేషన్‌కార్డులో పేరు ఉన్న వారి ఆధార్‌కు ఈ కేవైసీ చేయించుకుంటేనే వచ్చే నెల రేషన్ అందుతుందని సీఎస్‌డీటీ లక్ష్మీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈనెల 31లోపు డీలర్లు, వీఆర్వోల వద్ద చేయించుకోవాలని ఆమె సూచించారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

అనంతపురం అర్బన్: ఉరవకొండ మండలం వై.రాంపురానికి చెందిన నవీన్‌కుమార్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు అందించారు. ఎస్సీ వర్గానికి చెందిన యల్లన్న 2021లో హత్యకు గురయ్యాడు. జీఓ 95 ప్రకారం యల్లన్న కుమారుడు నవీన్‌కు ఉద్యోగావకాశం కల్పించారు. చాబాలలో సాంఘిక సంక్షేమబాలుర వసతి గృహంలో వంట మనిషిగా నియమించారు.